క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తలతో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని, కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డితో పాటు తామం తా అండగా ఉంటామని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని గడసాం గ్రామంలో తన సోదరుడు మాజీ ఎమ్మె ల్యే బొత్స అప్పలనర్సయ్య రైస్ మిల్లు ప్రారంభించడానికి వచ్చిన ఆయన పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు. ప్రతీ ఒక్కరిని పేరు పేరునా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీఎస్‌డీటీ మూర్తి

జామి: ప్రతి నెలా లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ మూర్తి రేషన్ డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందించాలని తెలిపారు. సరుకుల పంపిణీలో అలసత్వం తగదని, అవకతవకలకు పాల్పడకూడదని చెప్పారు. గొడౌన్ నుంచి డిపోలకు సరుకులు వచ్చినప్పుడు సరిచూసుకోవాలని సూచించారు.

జిల్లాస్థాయి రగ్బీ పోటీలకు అర్హత



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ రగ్బీ పోటీలకు అర్హత సాధించారని ఆ పాఠశాల హెచ్ఎం తిరుపతి రావు సోమవారం తెలిపారు. బొండపల్లి మండలం దేవుపల్లి ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రగ్బీ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో ఎం.తనూజ, అనూష, వి.శ్రీలక్ష్మి, బాలుర విభాగంలో బి.దుర్గాప్రసాద్, జి.సన్యాసిరావు, బి.లక్ష్మణ్, వెంకటరమణ,ఎం.శ్రీను, కె.గణేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను, పీడీ రాంబాబును హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఎల్.రమేష్, తదితరులు అభినందించారు.

శ్రీరంగరాజపురంలో వైద్యశిబిరం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: శ్రీరంగరాజపురం సచివాలయంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబి రంలో 53 మందికి జ్వరం, బీపీ, సుగర్, తదితర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి శిబిరానికి రాలేకపోయిన బెడ్ రెస్ట్ రోగులు, వృద్ధులకు వైద్య సేవలందించారు.

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

చీపురుపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేటుకు సమీపంలో చీపురుపల్లి-లావేరు ప్రధాన రహదారిపై సుమారు 6 అడుగుల కొండ చిలువను స్థానికులు సోమవారం హతమార్చారు. తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పాపాయమ్మ, వర్మ, తదితరులు

మెరకముడిదాం: బిళ్లలవలస గ్రామంలో సీసీరోడ్డు, కాలువ, కల్వర్టుల నిర్మాణ పనులకు సర్పంచ్ తిరుమలరాజు పాపాయమ్మ ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు వర్మ సోమవారం భూమిపూజ చేశారు. గ్రామపెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- జిల్లాలో 45,126 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
- మోడల్ మండలంగా వేపాడ ఎంపిక
- సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



వేపాడ మండలం దబ్బిరాజుపేటలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)



జగ్గయ్యపేటలో జిల్లేడు కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కొండగంగుబూడిలో ఏటీఎం మోడల్‌లో సాగుచేస్తున్న కూరగాయ పంటలను పరిశీలిస్తున్న డీపీఎం ఆనందరావు(ఫైల్)

వేపాడ:

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరిస్తోంది. పుడమితల్లిని సారవంతంగా ఉంచడమే లక్ష్యంగా పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా తక్కువ ఖర్చుతో సాగుతున్న ప్రకృతి వ్యవసాయం ఓ సరికొత్త సామాజిక ఉద్యమంలా మారుతోంది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల ఆహార పంటల ఉత్పత్తుల్లో వాటి అవశేషాలు ఉండిపో తున్నాయి. ఆఉత్పత్తులను తినే వారి ఆరోగ్యాలు పాడవుతుండడంతో పాటు పర్యావరణానికి కూడా రసాయన ఎరువులు, పురుగు మందులవల్ల హాని కలుగుతోంది. దీంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వాలు ఎంతో కాలంగా ప్రోత్సహిస్తున్నాయి. జిల్లా రైతులు కూడా చైతన్యవంతమై ఈ విధానంలో పంటలు సాగు చేసేందుకు మక్కువ చూపిస్తు న్నారు. జిల్లాలో 45,775 మంది రైతులు 45,126 ఎకరాల్లో వరితో పాటు వివిధ పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మోడల్ మండలంగా ఎంపిక చేసిన వేపాడలో 4,780 మంది రైతులు 4,828 ఎకరాల్లో ఈ విధానంలోపంటలను సాగు చేస్తున్నారు. రైతులకు వ్యవసాయశాఖ, ఏపీసీఎన్ఎఫ్, ప్రకృతి వ్యవసాయ కేంద్రం సిబ్బంది సంయుక్తంగా సాగు పద్ధతులు, కషాయాలు,సేంద్రియ ఎరువులు, ఘన, ద్రవ, జీవామృతాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

సాగువిస్తీర్ణం పెంచేలా ప్రణాళికలు



ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడు సాధించవచ్చు. జిల్లాలో 45126 ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ విస్తీర్ణా న్ని మరింతే పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రసాయన ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.ఆనందరావు,
జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుమేనేజర్

కూరగాయల సాగుకు ఏటీఎం మోడల్

ప్రకృతి వ్యవసాయంలో భాగంగానే ఏడాది పొడవునా రైతులు ఆదాయం ఆర్జించేలా ఏటీఎం మోడల్‌లో కూరగాయల సాగును అధికారులు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 705 ఎకరాల్లో ఈ విధానంలో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఏటీఎం మోడల్‌లో భాగంగా ఒక్కో రైతు 20 సెంట్లలో భూమిని బెడ్లగా చేసి వాటిపై అనేక రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నారు.

తెగుళ్లకు కషాయాలతో చెక్

వరి, ఇతర పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు వినియోగించాల్సిన కషాయాల తయారీపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విస్తృతంగా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. స్థానికంగా రైతులకు అందుబాటులో లభించే వివిధ రకాల పత్రాలు, గోమూత్రం, పేడతో కషాయాలు తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. జిల్లేడు ద్రావణం, దశపర్ణి కషాయం, తూటికాడ కషాయం, ద్రవజీవామృతం, తదితర కషాయలు, సేంద్రియ ఎరువులను రైతులు సొంతంగా తయారు చేసుకుని పంటల్లో చీడపీడల నివారణకు వినియోగిస్తున్నారు.

కెంగువలో డయేరియా

- నలుగురికి అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామంలో డయేరియా ప్రబలింది. గత కొద్ది రోజులుగా ఒకరిద్దరు చొప్పున డయేరియాతో అస్వస్థతకు గురవుతున్నారు. ఆస్పత్రిలో వైద్యసేవలు పొంది కోలుకుంటున్నారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన పెనుమజ్జి సత్యం, సుంకరి సింహాచలం, మండల రాములమ్మ, శనపతి బంగారునాయుడు డయేరియా బారినపడ్డారు. వీరిలో మొదటి ముగ్గురు గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతుండగా, బంగారునాయుడును ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. లోగిశ గ్రామ సమీపంలోని చంపావతి నది నుంచి గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సాయిశ్వర్యారెడ్డి, సుష్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. వైద్యసేవలు అందించడంతో పాటు తాగునీటి శాంపిల్స్ సేకరించారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక



శృంగవరపుకోట: బాస్కెట్ బాల్, త్రోబాల్, హాకీ పోటీలకు ఎంపికైన వెంకటరమణపేట హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



గుర్ల: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన చింతలపేట హైస్కూల్ విద్యార్థులతో హెచ్ఎం గౌరీశ్వరి, పీఈటీ లక్ష్మణ్



కొత్తవలస: వాలీబాల్ పోటీలకు ఎంపికైన రాజేష్‌ను అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ స్కూల్ కరస్పాండెంట్,ప్రిన్సిపాల్



కొత్తవలస: కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్ సూర్యనూకరాజు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు పదిమంది రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హత సాధించారని హెచ్ఎం లక్ష్మి సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్, త్రోబాల్, హాకీ క్రీడా పోటీలు నిర్వహించారు. బాస్కెట్ బాల్ అండర్-17 విభాగంలో పి.రోహిత్, ఈ.కుమారి, పి.లహరి, అండర్-14 విభాగంలో శ్యామ్, యు.కుసుమవాణి, ఏ.గీతాంజలి, త్రోబాల్ పోటీల్లో కె.బంగారులక్ష్మి, ఎస్.శరణ్య, హాకీ పోటీల్లో ఎర్ని సాయికృష్ణ, ఎం.కార్తీక్ ఉత్తమ ప్రతిభకనబరిచి జిల్లా జట్లలో స్థానం సాధించారు. విద్యార్థులను, పీఈ టీ గణేష్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థులు

గుర్ల: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట హైస్కూల్ నుంచి అయిదుగు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం గౌరీదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడి యంలో ఇటీవల జిల్లాజట్లకు ఎంపికలు చేశారు. అండర్-14 బాలుర విభాగంలో విద్యార్థి ముర ళి, తేజ, బాలికల విభాగంలో జ్యోతిసాయి, అండర్-17 బాలుర విభాగం లో పిల్ల హేమంత్, బాలికల విభాగంలో గిద్ద లావణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లలో చోటుసాధించారు. విద్యార్థులను, పీఈటీ లక్ష్మణ్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటే పోటీలకు కొత్తవలస విద్యార్థులు

కొత్తవలస: స్థానిక ఒకినోవా కరాటే అకాడమీ విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని కోచ్ సూర్య నూకరాజు సోమవారం తెలిపారు. విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలో శనివారం నిర్వహించిన పోటీల్లో అండర్-17 బాలుర విభా గంలో ఎం.అభిషేక్, విజయగనరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-14 బాలికల విభాగంలో కె.జయశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు.

వాలీబాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థి

కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థి మేడిశెట్టి రాజేష్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠ శాల ప్రిన్సిపాల్ సుధారాణి సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాజేష్ ఉత్తమ ప్రతిభకనబరిచి జిల్లా జట్టులో చోటు దక్కించుకు న్నాడని చెప్పారు. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ కేథరిన్, పీఈటీ భూషన్ అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



వేపాడ: విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు, ఉపాధ్యాయులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలసలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న సీఐ ఉపేంద్ర

వేపాడ: మండలంలోని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 10 పాఠశాలల్లో 1,2వ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు సోంపురం హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఆతవ రవి శంకర్, ఎల్.కోట కేజీబీవీ హిందీ సీఆర్టీ అనురాధ దంపతులు నోట్ పుస్తకాలు వితరణ చేశారు. దాతలు సమకూర్చిన నోట్ పుస్తకాలను సోంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ-2 బాలభాస్కరరావు సోమవారం అందజేశారు. దాతలను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ రామ్‌ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదుళ్లవలసలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస అంబేడ్కర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర సోమవారం నోట్ పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. సమతా సైనిక్‌దళ్ కన్వీనర్ ఎత్తుల ఈశ్వరరావు తన తల్లి లక్ష్మి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు సమకూర్చారు. దాతను సీఐ అభినందించారు. యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

24న మెగా జాబ్‌మేళా

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు, జేకే సీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న సోమ వారం సంయుక్తంగా ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ), రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న యువతీ,యువకులు అర్హులని పేర్కొన్నారు. హెటిరో, జస్ట్ డయల్ లిమిటెడ్, భారత్‌పే, గ్లాండ్ ఫార్మా, శ్రీరామ్ ఫైనాన్స్, వంటి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు.అర్హులు, ఆసక్తి గల అభ్యర్థులు స్కిల్‌యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని ,రిఫరెన్స్ నంబర్‌తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 79956 91259 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల



రంగారాయపురంలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్య శిబ్బంది

లక్కవరపుకోట: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడం వల్ల వాటి ఎదుగుదల బాగుంటుందని, రోగ నిరోధకశక్తి పెరిగి మరణాలు తగ్గుతాయని ఎల్.కోట పశువైద్యాధికారి గాయత్రీదేవి అన్నారు. మండలంలోని రంగరాయపురం గ్రామంలో 250 మేకలు, 150 గొర్రెలకు సోమవారం నట్టల నివారణ మందులు వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ మందును జీవాలకు వేయడం వల్ల పిల్లలు అధిక బరువుతో పుడతాయని, జీవాలు ఆరోగ్యంగా, బలంగా చురుకుగా ఉంటాయని తెలిపారు. రంగరాయపురం, కిత్తన్నపేట గ్రామాల పశుసహాయకులు రాజు,రఘు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి



వేపాడ: కొత్తబొద్దాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ జగదీశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. కొత్త బొద్దాం ప్రాథమిక పాఠ శాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించడంతో పాటు వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించా రు.విద్యార్థుల దస్తూరీ మెరు గుపర్చాలని, తరగతిగది గోడలపై పాఠ్యాంశాలతో కూడిన చార్టులు ఏర్పాటు చేయాలని హెచ్ఎం శారదాదేవికి సూచించారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

జామి: మండలంలో విజినిగిరి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటలను ఎంఈఓ బి.గంగరాజు సోమవారం పరిశీలించారు. నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. అంతకుముందు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రతిభ కళాశాల అధ్యాపకులు

గజపతినగరం: కేంద్ర రక్షణశాఖ ఇటీవల నిర్వహించిన అగ్నిపథ్ పరీక్షలో స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన కె.సత్యనారాయణ, కె.కిరణ్ కుమార్, అబ్దుల్, పి.ప్రసాద్, పి.రామునాయుడును కళాశాలలో సోమవారం సన్మానించి, అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేజీబీవీకి తూనిక యంత్రం అందజేత



కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బందికి తూనికయంత్రాన్ని అందజేస్తున్న ఎంఈఓ-2 ధర్మశ్రీను

మెరకముడిదాం: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ)బిళ్లలవలస గ్రామానికి చెందిన బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధి రామరాజు రూ.9 వేల విలువైన తూనిక యంత్రాన్ని సమకూర్చారు. ఈయంత్రాన్ని ఎంఈఓ-2 ధర్మశ్రీను చేతుల మీదుగా కేజీబీవీ ఎస్ఓ గౌష్యాబేగమ్‌కు సోమవారం అందజేశారు. సీఆర్ఎంటీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయాను తొలగించడం సరికాదు



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తమ్మినేని, అంగన్‌వాడీ వర్కర్లు

గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రం ఆయా మానాపురం సౌజన్యను అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల కు తలొగ్గి విధుల నుంచి తొలగించాలని చూడడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సౌజన్యతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఆయా సౌజన్యపై దురుద్దేశంతో టీడీపీకి చెందిన ఆ గ్రామ సర్పంచ్ లేనిపోని ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేయగా, అత్యుత్సాహంతో ఐసీడీఎస్ అధికారులు ఆమెను ఉద్యోగం నుంచి తొలగించేందుకు నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. సమస్యను అధికారులకు వివరించి, వినతి పత్రం అందజేయాలని ఐసీడీఎస్ కార్యాలయానికి వస్తే అధికారులు సిబ్బందితో గేటుకు తాళాలు వేయించి లోపలకు రానివ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారులకు అంత అత్యుత్సాహం ఎందుకు అని నిలదీశారు. స్థానిక అధికారులు సమస్యను మంగళవారం పరిష్కరించకుంటే ఈనెల 23వ తేదీన ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.సుభాషిని, పి.జ్యోతి, పద్మ, సౌజన్య పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు



దత్తిరాజేరు: లింగరాజపురంలో గ్రామసభ నిర్వహిస్తున్న రీసర్వే డీటీ రత్నకుమారి



వేపాడ: పెదగుడిపాల గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ సన్యాసినాయుడు

దత్తిరాజేరు: సమగ్ర భూరీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని సమగ్ర భూసర్వే డీటీ రత్నకుమారి తెలిపారు. లింగరాజపురం గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే జరిగిన తర్వాత వన్‌బీలు రాకపోయినా ఖాతా నంబర్లు తప్పుగా నమోదైనా, భూముల హద్దులు మారినా, పూర్తిస్థాయిలో భూముల వివరాలు రికార్డుల్లో లేకపోయినా రైతులు వినతులు అందజేయవచ్చని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పెదగుడిపాలలో..

వేపాడ: మండలంలోని పెదగుడిపాలలో డీటీ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమవారం రీసర్వే భూసమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. 25 మంది రైతులు తమ భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. సర్పంచ్ గొటివాడ దేవి, ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం



ఎంపీడీఓతో సమావేశమైన ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్‌లు

దత్తిరాజేరు: రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల హక్కులను కాలరాస్తోందని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చాంబర్‌లో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను మండలంలోని 30 గ్రామాల సర్పంచ్‌లు సోమవారం కలిసి వారి సమస్యలను వివరించారు. సర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు గ్రామసభలు నిర్వహించడ మేంటని ప్రశ్నించారు. పంచాయతీ పాలకవర్గం అనుమతి లేకుండా ఎంపిక చేసి ఇటీవల గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో ప్రారంభించిన పనులకు ఇప్పుడు తీర్మానాలు ఇవ్వాలని సర్పంచ్‌లపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరైన పనులను సర్పంచ్‌లతోనే చేయించాలని ఎంపీడీఓను కోరారు. ఇక నుంచి సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా గ్రామ సభలు,సమావేశాలు నిర్వహిస్తే ఊరుకునేది లేదని పలువురు సర్పంచ్‌లు అన్నారు.